సాక్షి

# రెండోదశ మరింత పటిష్టంగా..

- మెట్రో రైల్ ప్రతిపాదనలను రూపొందించాం..
- హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- ఆడిట్ వారోత్సవాలు ప్రారంభం




సాక్షి, సిటీబ్యూరో: భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆడిట్, అకౌంట్స్ శాఖ పాత్ర చాలా కీలకమని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. భారత ఆడిట్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్(ఏజీ ఆఫీస్)లో సోమవారం ఆడిట్ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ప్రజాధనం పూర్తిగా సద్వినియోగం కావడంతో పాటు వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్న వ్యయాన్ని తగు విధంగా పరిశీలించే లక్ష్యంతో పనిచేస్తున్న సీఏజీ, ఈ వారోత్సవాల ద్వారా ప్రజలకు అవగాహన కలిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న దశలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనే యంత్రాంగాన్ని అన్ని విభాగాల్లో సన్నద్ధం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రస్థానంలో ఎదురైన అనేక సమస్యలు, సవాళ్లను ఆయన వివరించారు. మెట్రో రెండో దశకు ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు సిద్ధం చేసి మంత్రి మండలి ఆమోదంతో కేంద్రానికి పంపించినట్లు పేర్కొన్నారు. మొదటి దశలో ఆర్థికంగా, సామాజికంగా ఎదురైన అనేక సమస్యలను అధిగమించేలా.. రెండో దశలో మరింత పటిష్టంగా ప్రతిపాదనలను రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో రీజినల్ కెపాసిటీ బిల్డింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ సి.శైలజ, తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిట్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆడిట్(సెంట్రల్) హేమ మునివెంకటప్ప, అకౌంటెంట్ జనరల్ ఆడిట్ పి.మాధవి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ కమర్షియల్ ఆడిట్ వి.ఎం.వి.నావల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.